# మేడమ్! - ఫ్రీడమ్!

ఇరవై నిండకముందే... ఫైనలియర్ డిగ్రీలోకి రాకముందే... నీరజ పేరెంట్స్ ఆమె మెడలు వంచి పెళ్లి చేశారు.

అప్పుడే పెళ్లెందుకని ఏడ్చి మొత్తుకున్నా విన్లేదు సరికదా ససేమిరా అన్నారు.

చదువంటావ్... ఉద్యోగం అంటావ్... తర్వాత వయసు మీరింది కదా పెళ్లెందుకంటావ్!? లేదూ... నీమనసుకు నచ్చిన ఏసన్నాసిగాడినో 'లవ్' చేశానంటావ్ నేటి ఆడపిల్లల తీరు మాకామాత్రం తెలీదా ఏం? పేరెంట్స్ చీవాట్లు పెట్టారు.

ఆడపిల్లకే వయసులో పెళ్లిచేసి అత్తవారింటికి పంపాలో కన్నవాళ్లకు ఆమాత్రం తెలియదా ఏం.. అనేసి మమ్మీ 'బ్రైన్' వాష్ చేసింది.

పేరెంట్స్ పోరు సాధింపు పడ్లేక సరేననక తప్పలేదు నీరజ!

అట్లా చెప్పిన మాట వినాలి! లేకపోతే పళ్లూడి నెత్తి ముగ్గు బుట్ట అయ్యాక పెళ్లేమిటే?...' ఎగతాళిగ మాట్లాడింది మమ్మీ.

తానెవరినీ లవ్ చేయలేదు. ఇంట్లో చెప్పకుండా ఏమగాడితోనూ వుడాయించాలనీ అనుకోలేదు. కానీ తన భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెంచుకుంది! రంగురంగుల కలలు కన్నది. డాక్టరేట్ చేసి టీచింగ్ ప్రొఫెషన్లో సెటిలవాలనుకుంది.

తనమాట ఆలోచన ఇంట్లో పెద్దవాళ్లముందు చెల్లుబాటు కాలేదు. తన అభిరుచికి ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో చిరాకు పడింది. అంతమాత్రాన పేరెంట్సను ఎదిరించలేకపోయింది నీరజ. తన మాట చెల్లుబాటు కానప్పుడు పెద్ద వాళ్ల నిర్ణయానికి తలొంచాల్సి వచ్చింది.

ఎంతసేపటికి ఆడపిల్ల పెళ్లి చేసి అత్తారింటికి పంపేయాలనేదే కన్నవారి ఆలోచన! ఈడొచ్చిన ఆడపిల్ల గుండెల మీద కుంపటిలా వుంటుందిట! ఓఅయ్య చేతిలో పెట్టేస్తే... తమ బాధ్యత తీరుతుందనేది అనాదిగా వస్తున్న పేరెంట్స్ ఆర్గ్యుమెంట్. అది తనకు నచ్చదు. మగాడి గొప్పేంటి?- ఆడపిల్లను వదిలించుకోవాలని తల్లిదండ్రులు ఎందుకు అనుకుంటారు? పెద్దవారి ఆలోచనా విధానంలోనే ఏదో పొరపాటుంది. కాదు తప్పుంది? అదేమంటే ఆచారం... సాంప్రదాయం... ఏవయసులో జరగాల్సిన ముచ్చట ఆవయసులో జరగాలనేది

పేరెంట్స్ పిడివాదం!

ఈ ముసలివారు మారరు సరకదా... మానసికంగ ఎదగరు. నిజానికి నేటి సమాజపు తీరు తెన్నులు కూడా అలాగే ఏడ్చినయ్! ఆడిపిల్లకు స్వేచ్ఛ.... స్వాతంత్రం లేకుండా పోయింది. పుట్టుకతోనే ఆడది బహీనురాలు. పుట్టి ఎదిగి చదువుకోవాలనుకున్నా... తనకిష్ఠమొచ్చినవాడిని... ఇష్ఠమొచ్చినప్పుడు పెళ్లాడన్నా అస్వతంత్రురాలు. మానసిక ధైర్యాన్ని ఆడవారిలో పెంపొందించదు నేటి సమాజం... ఎన్నో ఆలోచనలు నీరజను కలవరపెడుతునే వున్నయ్.

ఆడపిల్లంటే కన్నవారికే బరువు! మోయలేని భారంగఫీలై పోయి అత్తారింటికి తరిమేయాలనేదే అందరి ఆలోచన! ఇది దుర్మార్గం కాదా? అవును ఈ పవిత్ర భారతంలో ఆడపిల్ల వంటరిగా మనలేదు. రౌడీయిజం... గుండాయిజం... విద్యార్ధి దశలో ర్యాగింగు... అదునుదొరికితే మానభంగానికి పాల్పడటం!... ఛీ!... ఏం మనషులో ఈ మగాళ్లు! ఆడవారి ఆవేదన ఎవరికీ పట్టదు. ఏదో వుద్ధరించేస్తున్నామన్నట్టు డ్రామా!-

× × × × ×

పెళ్లి చేసి తల్లితండ్రులు తమ పీడ వదిలించుకోవటంతో నీరజ అత్తవారిల్లనే మరో ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

కొత్త ఇల్లు...కొత్త చోటు... కొత్త మనుష్యులు... కొత్త అలవాట్లు... కొత్త వాతావరణం మధ్య నీరజ!

భర్త మహాశయుడికి ఆఫీసే ఆరాధ్య దైవం! మరో వ్యాపకంగాని... వ్యాసంగం గానీ బొత్తిగా లేవు. స్నేహితులు లేరు! క్లబ్‌కు వెళ్లడు. పేకాట చేత కాదు. మందు ముట్టడు. సిగరెట్ వాసన పడదు. భార్య ముఖంలోకి కూడా సూటిగా చూస్తూ మాట్లాడలేని మహాపిరికి మనస్తత్వం శ్రీనివాస్‌ది!

శ్రీనివాస్‌కి ఇల్లే స్వర్గం! భార్యే వైకుంఠం! సంధ్యవేళ ఆఫీసు నుండి ఇల్లు చేరుకుంటాడు. ఆకాశంలో చుక్కలు పొడవకనే డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటాడు. ఎనిమిది కొట్టకముందే బెడ్డేక్కేస్తాడు. ఇదీ అతగాడి దిన చర్య!

భార్య మంచం మీదికి ఎప్పుడొస్తుందాని ఎదురుచూపులు! వచ్చీ రాగానే ముద్దు మురిపెం సన్నగిల్లటం... గిచ్చటం షురూ! వంట్లో ఆరోగ్యంగా వున్నా లేకున్నా...

మూడ్‌వున్నా లేకపోయినా అభ్యంతరం చెప్పకూడదు. అవసరం తీరేక అదమరిచి గుర్రుపెట్టటం! ఇదీ భర్త మనస్తత్వం! చిత్రమైన మనిషి మగాళ్లంతా ఇంతేనానేది నీరజ ఆలోచన! కోపం, చిరాకు... తనమీద తనకే అసహ్యం... జుగుప్స! ఇదేనా వైవాహిక జీవిత పరమార్ధం అనే ప్రశ్న పీక్కుతినేస్తూవుంటుంది.

ఏడాదైనా తిరక్కుండానే నీరజ బిడ్డకు తల్లి అయింది. మొగుడు మహాశయుడు మహాఘనకార్యం చేసినట్టు మీసం దువ్వి వికటాట్ట హాసం చేశాడు. బెత్తం పుచ్చుకుని శ్రీవారి వీపున నాలుగు వడ్డించాలన్నంత కోపంముంచు కొచ్చింది నీరజకు. ఓ మగాడనే భర్త భార్యను సంతానవతిని చేయటం కూడా గొప్పేనా? అన్పించింది.

నీరజ భర్తకు సేవలతో... ఇంట్లో చాకిరితో చిక్కిసగమైంది. మొదటి బిడ్డ ఏడాది నిండకుండానే తనకు మూడో నెల గర్భం! తన ఆరోగ్యం... మానసిక స్థితి దెబ్బతింటున్నందుకు ఆమె మనసు భోరున విలపిస్తోంది. ఇదేనా జీవితం? ఎంత యాంత్రికం? ఇలాంటి బ్రతుకునా తానుకోరుకుంది? తనవుకు మనసుకు విశ్రాంతి కరువవుతోంది.

భర్తకోసమో... అత్తమామల కోసమో కృతకంగ లేనినవ్వు పెదాలపై పులుముకోవటం ఎబ్బెట్టుగా తన మటుక్కు తనకే అన్పిస్తోంది. అంతా అభినయమే ఇలా నాటకం ఎన్నాళ్లు? జీవిత కాలమా?, ఓరి దేవుడో తన వల్ల కాదు. ఇంత చిన్న వయసులో ఎన్నెన్ని కష్టాలు?

దేవుడూ... నువ్వుమంచోడివి కావు! ఛీ!... ఆడపుటక్కి అన్నీ ఇబ్బందులే.. అనర్ధాలే... శాపాలే! దాసిదాని బ్రతుకు. భర్త తన బ్రతుకును ఛిద్రం చేస్తున్నాడు. పీక్కుతింటున్నాడు. చిరిగిన విస్తరాకవుతోంది బ్రతుకు!

ప్రతిసారీ పెరిగే పొట్టలో పడే యాతన అంతా ఇంతా కాదు. ప్రసవ వేదన జీవన్మరణ సమస్య. మొగుడు మహాశయుడికి ముద్దులు... సరదాలు... మాత్రమే సుందర లోకంగా ఫీలవుతాడు. కానీ... స్త్రీ నరకయాతనపడుతుంది.

అదేమంటే... తాళికట్టించుకున్న క్షణానే భర్తకు పవర్‌పట్టా చేతికొచ్చినట్టు బిహేవ్ చేస్తాడు. కళ్లెర్ర చేయటం... తిట్టటం... కొట్టటం హక్కులాగ ఫీలవుతాడు. ఇదంతా పురుషాహంకారం కాక మరేంటి?-

ఆడది... అందునా భార్య ఎదురు తిరగలేదు. అథవా తిరిగిచెయ్యి ఎత్తితే గయ్యాళి... రాక్షసి... బరితెగించింది... అనే బిరుదుల ప్రదానం!

తనమాట సాగటం లేదు. తాను కోరుకున్న విధంగా లైఫ్ హేపీ సాగటం లేదు. తన ఆశ నెరవేరటం లేదు. భర్త కరుకు కబంధ హస్తాల్లో లేడిపిల్ల భార్య... అన్పిస్తోంది. ఎంతటి దయనీయ స్థితి?... స్వేచ్ఛ అనేదే లేకుండా పోయింది.

డిగ్రీ రిజల్ట్స్ వచ్చే నాటికి తనకు ఏడో నెల! బైట తిరగాలన్నా... ఫ్రెండ్స్‌ను కలవాలన్నా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ తనను ఇబ్బంది పెడుతోంది. మగాళ్లంతా తన గర్భం కేసి విచిత్రంగానో... అసహ్యంగానో చూపులు విసరటం గమనిస్తూంటే తనమీద తనకే జాలి! చికాకు... చిరాకు... ఇంతకు మించిన నరకయాతన మరొకటి వుండదన్పిస్తోంది నీరజకు.

స్త్రీ పడే పాట్లకి అందమైన పేర్లు! మాతృత్వం వరమని... సంసారం స్వర్గమని... ఇంకా ఎన్నో? ఎన్నెన్నో? అంతా బోష్! ట్రాష్!! హిపోక్రసీ!

ఆడది అందంగా వున్నాలేకపోయినా మగాడు అనుభవించటానికి అదొక పదార్థం! ఆడుకోవటానికి ఒక బంతి! ఇంతి... పూబంతి... చామంతి... కవులెంత గొప్ప వాళ్లు?

హుఁ! ఖర్మకాకపోతే... పాతికేళ్లు నిండకుండానే తాను ముగ్గురు పిల్లల తల్లి కావటమేంటి? ఈ లెఖన మరో పదేళ్ల కాపురంలో ఇంకో అరడజను మంది పుట్టుకొస్తారు. వీళ్లందరిని కని పెంచలేక తన చావుకొస్తుంది.

ఇదంతా నాణానికి రెండో వైపు!

శారీరక సుఖం కావలసినప్పుడల్లా భర్త తనను పొగడ్తలతో ముంచెత్తటం... రెండు మూరల మల్లె పూల చెండు ముఖాన విసిరి నీ బతుక్కిది చాల్లే... సరిపెట్టుకోమనే చూపుల తనను గాయపరుస్తయ్. రంపపు కోతకు గురి చేస్తయ్!

ఇతర సమయాల్లో రవంత పొరపాటుకి దెప్పుళ్లు... తిట్లు... చీవాట్లు... ఈ సడింపు... తనపై చెయ్యి చేసుకోవటాలు! ఏం ఆడబ్రతుకురా భగవంతుడా?- పగవాళ్లక్కూడా వద్దు ఈ నరకయాతన!

తనూ తిట్టగలదు. చెయ్యెత్తగలదు. వీరనారిలాగ యుద్ధం చేయగలదు. కథ క్లైమాక్స్ కొస్తే భర్తలు భార్యలను వదిలేసినట్టు తనూ మొగుడికి గుడ్‌బై

చెప్పేయగలదు. మొగుడు రాచిరంపాన పెడుతున్నాడని పోలీస్ కంప్లైట్ ఇవ్వగలదు. కానీ చేయ మనస్కరించటం లేదు.

హుఁ! పడతి జీవితం హారతి కర్పూరమే, కొవ్వొత్తే! అసలు మహిళల్లో ఇంత పిరికితనం... నిస్సహాయతదేనికి? కాలాన్ని మార్చే ప్రక్రియ చేపట్టటంలో ఆడది అందునా భారతీయ మహిళ ఎక్కడో అట్టడుగున అదఃపాతాళంలోనేవుంది.

మహిళాభ్యుదయం కేవలం మాటలకే పరిమితమైంది. ఛీ! ఛీ! ఎంత సిగ్గు చేటు. అసలు ఆడివారిలోనే సఖ్యత లోటు! ఈర్ష్యా ద్వేషాలు మెండు! అందుకే ఎక్కడవేసిన గొంగళి అక్కడే అనే సామెత మహిళల పట్ల నిజమై ఋజువైంది!

పురుషులు సైతం పిల్లలనుకనే ప్రక్రియ ఆదేవుడు ఎందుకు క్రియేట్ చేయలేదు. దేవుడూ మగాడేకదా? అందుకే వెనకడుగు వేసి వుంటాడు! పురుషాధిక్యత పురాణ కాలం నుండి వుంది. స్లేవరీ ఆడపుటకలోనే వుంది! పురుషు/డిలో స్త్రీ సగభాగమే కాగలగింది. సింహభాగం కాలేకపోయిందెందుకని?

కష్టాలన్నీ ఆడవాళ్ల నెత్తిన రుద్ది... అన్ని సుఖాలు మగాళ్లకిచ్చాడా దేవుడు!

మెడలో మూడు ముళ్లు... పుస్తెలు... చంకలో బిడ్డ... పక్కలో మొగుడు ఇది ఆడదానికి బ్రతుక్కి నిర్వచనం!

ఇలా ఆలోచిస్తూంటే నీరజకు తనమీద తనకు అసహ్యమేస్తోంది. రోతపుడుతోంది! అయిష్టత కలుగుతోంది! ఇలాంటి బ్రతుకు తాను కోరుకోలేదు. కావాలని ఉవ్విళ్లూరలేదు. బలవంతాన మొగడనే గుదిబండను తన మెడకు అమ్మా నాన్న తగిలించారు

ఆడదానికి చీపురు కట్టే సర్వస్వం!

పంచపాండవుల్లాగ ఐదుగురు బిడ్డల్ని తనకు కనివ్వాలని భర్త తన చెవిలో శోభనం రాత్రి వూదినపుడే తనకు అసహ్యమేసింది. అయిదుగురుని కాకుంటే యాభై మందిని కనమంటాడు ఆయనదేం పోతుంది?

'అంతమందిని కనటం నావల్ల కాదని' తెగేసి చెప్పిన క్షణాన చెంపఛెళ్లు మన్పించాడు పతి దేవుడు. చింత నిప్పులాంటి అతని కళ్లల్లోకి చూడ సాహించలేక పోయింది. భయంతో వణికిపోయింది.

నీరజ పుట్టింటికెళ్లింది! విషయాలన్నీ విపులంగ వివరించి అక్కడే

వుండేటందుకు నిర్ణయించకుంది. నో అన్లేదు పేరెంట్స్!

పి.జి. చేసి.... కష్టపడి చదివి సివిల్స్ రాసి ఐ.ఏ.ఎస్ ఎగ్జామ్ పాసై... జాయింట్ కలక్టరైంది. భర్త తనను అనుక్షణం అవమానిస్తూ అమానుషంగా ప్రవర్తించి తీరు నీరజ మనో ఫలకం నుండి తొలగిపోలేదు.

అందుకే... భర్తను తన బంగళాకి పిలిపించుకుంది.

నీరజకు ఎదురుగా నిలబడి శ్రీనివాస్ ఈ అనూహ్య పరిణామానికి నివ్వెర పోయాడు. భార్యను ఐ.ఏ.ఎస్ అవుతుందని గాని... జాయింట్ కలక్టరై తనను నిలదీస్తుందని గాని వూహించలేకపోయాడు.

ఏది ఏమైనా నీరజ తన భార్య! తనను గౌరవించకమానదు! తలొంచుకుని తప్పుచేసిన వాడిలా తలవంచుకు నిలబడ్డాడు.

'మిస్టర్ శ్రీనివాస్!... బలవంతాన నామెడలోంచి లాక్కున్న తాళి ఎక్కడ?... అదే... నువ్వుకట్టింది!-' లాఠీతో కొట్టినట్టు అడిగింది.

'మౌనం నీ ప్రశ్నకు సమాధానం కాదు...' ఆడపులిలా హుంకరించింది నీరజ.

నీళ్లు నమిలాడు శ్రీనివాస్. వంచిన తల ఎత్తలేదు. సిగ్గుతో శరీరంలో అణువణువు దహించుకుపోతోంది.

'నాకున్న జుడీషియల్ పవర్స్‌తో నిన్ను జైల్లో పెట్టించగలను- నీ అంత నైత్యానికి ఒడిగట్టలేను. నేను ఆడదాన్ని, నాలో జాలి దయ మెండుగా వున్నయ్. అండర్‌స్టాండ్....'

'నిన్ను విశాల హృదయంతో క్షమించగలను. ఎందుకంటే నీ నుండి నేను విడిపోయినా... నువ్వు సెకండ్ మ్యారేజ్ చేసుకోలేదు. అందుకని! ఐలైక్ యు... ఐ లవ్ యూ డార్లింగ్ - నువ్వు పిల్లలతో నా బంగళాకొచ్చెయ్. అందరం కలిసి ఆనందంగ వుందాం!!-'

శ్రీమతి విశాలహృదయానికి సిగ్గుతో బిక్క చచ్చిపోయిన వాడిలా ముఖంపెట్టి అక్కడి నుంచి కదిలాడు కంటిలో నీరుతో....

(సమాప్తం)